విశాలాంధ్ర
విశాఖపట్నం
శనివారం 6, డిసెంబర్ 2025

యాచకులకు ఆశ్రయం కల్పించే దిశగా సీపీ చర్యలు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: భిక్షాటనను (బిచ్చమెత్తడాన్ని) నేరంగా పరిగణించకుండా, వారికి పునరావాసం కల్పించే దిశగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చర్యలు చేపడుతున్నారు. ఈ దిశగా కమిషనర్ ఆదేశాలతో యాచకులకు ఆశ్రయం కల్పించే కార్యక్రమంలో, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ బి.భాస్కర్, ఎం. ప్రసాద్, ఎస్సై, ఏ.ఆర్, సిబ్బంది సహాయంతో శ్రీ కనక మహాలక్ష్మి దేవస్థానం, కురుపాం మార్కెట్, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్, కాన్వెంట్ జంక్షన్, జ్ఞానపురం, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో భిక్షాటన చేస్తూ సంచరిస్తున్న 17 మంది యాచకులను సేకరించి, వారికి జి.వి.యం.సి. షెల్టర్ హోం, టి.ఎస్.ఆర్ కాంప్లెక్స్ నందు వారికి ఆశ్రయం కల్పించటం జరిగింది. పోలీస్ కమీషనర్ తదుపరి ఆదేశాలతో వారి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి వారిని వారి కుటుంబ సభ్యులతో షెల్టర్ హోం నిర్వాహకుల మరియు సంబందిత పోలీస్ స్టేషన్ అధికారి సమక్షంలో పునఃకలయిక నిర్వహించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

భవిత కేంద్రంలో పిల్లలకు రెడ్డిపల్లి జగదీష్ మాస్టర్ దంపతులు చేయూత

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో భవితా కేంద్రానికి రెడ్డిపల్లి జగదీష్ మాస్టర్ దంపతులు చేయూతనందించారు. ఈ కేంద్రంలోని పిల్లలకు అన్నం తినే ప్లేట్స్, మంచినీళ్ల తాగటానికి గ్లాసులు వితరణ చేశారు. జగదీష్ మాస్టారు మానవసేవలో నిత్యం ఏదో ఒక రూపంలో తమ వంతు సహాయ సహకారాలను అందిస్తుంటారని అన్నారు. అనంతరం భవిత కేంద్రానికి చెందిన విద్యార్థి ఎం.భవాని శంకర్ తల్లి కి సన్మానం చేయడం జరిగింది. పెద్ద మనసు చాటుకున్న రెడ్డిపల్లి జగదీష్ మాస్టర్ దంపతులకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి సర్పంచ్ ఎస్.ఆదిబాబు, ఈ.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం, అభ్యున్నతే ప్రభుత్వ అజెండా

- రూ.70 కోట్లతో వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు నైపుణ్య శిక్షణ అందిస్తాం
- గతంలో నిలిచిపోయిన పథకాలను కొనసాగిస్తాం
మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, అభ్యున్నతే ప్రధాన అజెండాగా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని, దానిలో భాగంగానే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందని, గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన కార్మిక సంబంధిత పథకాలను తిరిగి కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. వారికి అన్ని విధాలుగా న్యాయం జరిగేలా, కష్టాలను తీర్చేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని గుర్తు చేశారు. కార్మికుల కుటుంబ సభ్యులకు, పిల్లలకు మెరుగైన ఉపాధి నిమిత్తం నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటోందని, దీనికి కోసం రూ.70 కోట్లు వెచ్చించనుందని వివరించారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా పలు భవన నిర్మాణ ప్రాంతాలను పరిశీలించిన అనంతరం స్థానిక మేఘాలయా హోటల్లో జరిగిన కోనసీమ, ఉత్తరాంధ్ర భవన నిర్మాణ కార్మికుల అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ క్రమంలో ముందుగా వివిధ అంశాలపై మీడియాతో మాట్లాడారు. కార్మికుల పనిదినాలు పెంచేలా, ఆదాయం రెట్టింపు అయ్యేలా చర్యలు తీసుకుంటామని, ప్రత్యేకంగా లేబర్ అడ్డాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆధునిక పరికరాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణలు అందిస్తామని, జీవన ప్రమాణాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పనిదినాలు పెరిగేలా, ఉపాధి మెరుగు పడేలా జీఎస్టీ రేట్లను కూడా తగ్గించామని మంత్రి గుర్తు చేశారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేలా, చదువును ప్రోత్సహించేలా ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం వర్తించేలా చర్యలు చేపట్టామన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్య సంస్థలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. విశాఖలో సుమారు రూ.106 కోట్ల వరకు సెస్ రావాల్సి ఉండగా, రూ.20 కోట్ల వరకు మాత్రమే వసూలయ్యిందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా రాష్ట్రంలో నిబంధనలు పాటించని సంస్థలపై ఇప్పటి వరకు 160 కేసులు పెట్టామని వివరించారు. కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద భీమా వర్తించేలా, మట్టి ఖర్చులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ వలవాల మల్లికార్జున రావు (బాబ్జీ) పేర్కొన్నారు. సాధారణ సమయంలో చనిపోయిన కార్మికులకు ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సాయం అందించాలని కార్మిక సంఘాల నుంచి ప్రతిపాదన ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో రూ.1 లక్ష ఇస్తున్నారని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

మెగా పేరెంట్స్ మీట్‌ను రాజకీయ వేదికగా మారుస్తున్న కూటమి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్‌ను కూటమి ప్రభుత్వం రాజకీయ వేదికగా మారుస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి అచ్యుతరావు ఆరోపించారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థి సంఘాలను ఇతర సంస్థలను ప్రభుత్వ పాఠశాలల్లో లోనికి రానివ్వకుండా జీవో తీసుకొచ్చారని ఆ సర్క్యులర్ టిడిపి నాయకులు, టిడిపి శ్రేణులకు వర్తించదా అని గుర్తు చేశారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ఉపాధ్యాయులు, విద్యా కమిటీలు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు నాయకులు అనుమతించాల తప్ప పార్టీ కార్యక్రమాలకి ప్రభుత్వ కార్యక్రమాలకి తేడా లేకుండా పాఠశాలలను రాజకీయ వేదికలుగా కూటమి ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. విద్యార్థుల కోసం పోరాటం చేసే విద్యార్థి సంఘాలపైన పాఠశాలలో ప్రవేశించకుండా ఇచ్చిన సర్క్యులర్ చూస్తుంటే కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నామని తక్షణమే సర్క్యులర్‌ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

10 శాతం మంది పేరెంట్స్ కూడా రాకపోతే ఎలా...?

పిల్లల విషయంలో ఇంత బాధ్యతా రాహిత్యమా.. ఎస్.ఎం.సి. చైర్మన్‌ను మార్చండి: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - భీమిలి: విద్యా రంగంలో సానుకూల ఫలితాలు తీసుకురావాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎంతగానో తపన చెందుతున్నారు. హైస్కూల్ లో 316 మంది, జూనియర్ కాలేజీలో 666 మంది విద్యార్థులుంటే 10 శాతం మంది తల్లిదండ్రులు కూడా రాకపోవడం విచారకరం. ఆ మాత్రం వారిలో చైతన్యం తీసుకు రాలేకపోతే ఎలా? గైర్హాజరైన స్కూల్ కమిటీ చైర్మన్ స్థానంలో బాధ్యత గల వ్యక్తిని తీసుకోండని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.

భీమిలి హైస్కూల్, జూనియర్ కాలేజీ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రుల హాజరు పలుచగా ఉండడం పట్ల తీవ్ర అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లి, తండ్రి ఇద్దరూ వచ్చిన వారు ఎంతమంది అని ప్రశ్నించగా, కేవలం ఒక జంట మాత్రమే నిలబడ్డారు. వెయ్యి మంది విద్యార్థులున్న క్యాంపస్‌లో 50 మంది తల్లిదండ్రులు రాలేదని, పిల్లల కోసం ఒక పూట కేటాయించకపోవడాన్ని ఏ రకంగా చూడాలి అని ప్రశ్నించారు. నిబద్ధతతో నడిపించాల్సిన కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులకు మంచి మార్కులు తీసుకురావడంతో పాటు సమాజానికి ఉత్తమ పౌరులను అందించే బాధ్యత కూడా గురువులదేనని గంటా పిలుపునిచ్చారు. స్కూల్లో పిల్లల నడవడిక.. ప్రవర్తన.. తెలుసుకోవడం ద్వారా వారు చెడు మార్గంలో వెళ్లకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. కార్యక్రమంలో భీమిలి జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఎమ్మార్వో పి.రామారావు, ప్రిన్సిపాల్ ప్రసాద్, హెడ్ మాస్టార్ పొన్నగంటి రమణ, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గొలగాని నరేంద్ర, అనిల్ ప్రసాద్, గాడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ సర్వీస్ రోడ్లలో నిత్యం ట్రాఫిక్ జామ్

విద్యార్థులకు, వాహనదారులకు నరకం
ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లోపంపై విమర్శలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: విస్తరిస్తున్న మధురవాడ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య నిత్యం నరకప్రాయంగా మారింది. ముఖ్యంగా సర్వీస్ రోడ్లలో వాహన చోదకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే కీలక సమయంలో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.? మధురవాడ లోని సర్వీస్ రోడ్లు ఒక్కసారిగా ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి. డి-మార్ట్ వద్ద ప్రారంభమైన వాహనాల రద్దీ, పూర్తిగా ఇరువైపులా సర్వీస్ రోడ్డు పొడవునా వ్యాపించి, రాకపోకలను నిలిపివేసింది. ఈప్రాంతం నుంచి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వచ్చింది.? మధురవాడ ప్రాంతంలో నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణంగా స్థానిక వాహన చోదకులు విమర్శిస్తున్నారు. క్రికెట్ స్టేడియం, కార్ షెడ్ జంక్షన్ నుండి మారికవలస వరకు ఇదే పరిస్థితి నెలకొంది. అత్యధికంగా మధురవాడ అండర్ పాస్ బ్రిడ్జి వద్ద అత్యధికంగా నిత్యం ట్రాఫిక్ చిక్కుముడి తప్పడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరం మధురవాడ ప్రాంతం వైపు అధికంగా విస్తరిస్తున్నప్పటికీ రోడ్లు విస్తరణ చేయకపోవడంతో సర్వీస్ రోడ్లలో మరింత ట్రాఫిక్ పెరిగిపోతుంది. మధురవాడలో ప్రధానంగా డీమార్ట్ వల్ల అత్యధికంగా ట్రాఫిక్ స్తంభించిపోతుంది. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ కు సర్వీస్ రోడ్లోనే నిర్మాణాలు చేయడం పార్కింగ్ సదుపాయం అధికంగా లేకపోవడంతో బ్రిడ్జి వద్ద అత్యధికంగా నిత్యం ట్రాఫిక్ చిక్కుముడి తప్పడం లేదని వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఏమాత్రం ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించడం లేదని, రోడ్ల వస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని మండిపడుతున్నారు. సర్వీస్ రోడ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు, వాహనాల కదలిక సజావుగా ఉండేలా చూసేందుకు కనీస స్థాయిలో కూడా ట్రాఫిక్ పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ట్రాఫిక్ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనీ స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుకుంటున్నారు.

మాస్టర్ ప్లాన్‌పై త్వరలో టెక్నికల్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ పై టెక్నికల్ కమిటీ త్వరలోనే సమావేశం అవుతుందని మెట్రోపాలిటన్ కమిషనర్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ పునః సమీక్షలో భాగంగా వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్ లో మార్పులు చేశామని తెలిపారు. దీన్ని టెక్నికల్ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. అనంతరం మరోసారి అభ్యంతరాలను స్వీకరించి తుది మాస్టర్ ప్లాన్ ని కరారు చేస్తామని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానిస్తూ ప్రతిపాదించిన ఏడు మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగిస్తామని చెప్పారు. సొంటి రోడ్డుకు సంబంధించి అటవీ శాఖ అధికారుల నుంచి క్లియరెన్స్ తీసుకుంటామన్నారు. మిగతా రోడ్లలో స్థలాలు కోల్పోయిన వారి నుండి గిఫ్ట్ డీడ్లు తీసుకుని టిడిఆర్లు మంజూరు చేస్తామన్నారు. ఋషికొండలో వైజాగ్ ఎక్స్పీరియన్స్ వర్చువల్ రియాలిటీ అరీనా, త్రీ స్టార్ హోటల్ ప్రాజెక్టు విశాఖ పర్యాటక రంగంలో మంచి అట్రాక్షన్ అవుతుందని చెప్పారు. ఇటీవల నిర్వహించిన వీఎంఆర్డీఏ బోర్డు సమావేశంలో పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఇంటిగ్రేటెడ్ టిక్కెట్ విధానంపై చర్చించామని చెప్పారు.

8 నుంచి గీతంలో "స్మార్ట్ ఇండియా హ్యాకథాన్"

విశాలాంధ్ర - మధురవాడ: దేశంలోని యువతలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ మరియు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసిటిఇ) జాతీయ స్థాయిలో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న "స్మార్ట్ ఇండియా హ్యాకథాన్" ఫైనల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వనున్నది. గీతంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలలో గల మరో 50 విద్యాలయాలలో, ఐఐటిలలో జరిగే ఈ స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్‌ను దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి ఈ నెల 8వ తేదీన ఉదయం వర్చ్యువల్‌గా ప్రారంభించనున్నారు. గీతంలో జరిగే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 25 విద్యార్థి బృందాలు పాల్గొనున్నాయని, 171 యువతీ యువకులు ఫైనల్ పోటీలకు హజరవుతున్నారని విశాఖ పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తున్న గీతం విడిసి కోచ్ బి.రాజ్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్-25 పోటీలలో పాల్గొనే జట్లకు 58 కేంద్ర ప్రభుత్వ శాఖలు, 15 రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, 7 ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న 271 సమస్యలను పరిష్కారం తెలపాల్సిందింగా సూచించారు. వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన పోటీలలో విజేతలను ఎంపిక చేసి సంబంధిత జట్లను జాతీయ స్థాయిలో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఫైనల్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలకు సంబంధించిన గోడ పత్రికను గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, విశాఖ నోడల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ రాజేశ్వరరెడ్డి, విద్యార్థి కోఆర్డినేటర్‌లు వివేక్, అభితేజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడి కార్డులు అందజేత

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం తాటితూరు జడ్పీహెచ్ఎస్ స్కూల్లో మెగా పేరెంట్ 3.0 మీటింగ్లో తాటితూరు గ్రామ పెద్దలు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో కోట మహంతి వెంకటాచలం 13 వేల రూపాయల ఖర్చుతో విద్యార్థులకు ఐడి కార్డులను అందజేశారు. కార్యక్రమంలో తాటితూరు గ్రామ సర్పంచ్ సిరిగిడి ఈశ్వర సంతోష్, ఉప సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు, టిడిపి అధ్యక్షులు కొమర రాము, మేడ చిన్నారావు, సింగిడి అప్పలరాజు, ఎక్స్ ఎంపిటిసి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ బుదుమూరు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఇండియా-సౌతాఫ్రికా వన్డే మ్యాచ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

విశాలాంధ్ర - పియం పాలెం: ఐ.డి.ఎఫ్.సి ఫస్ట్ బ్యాంక్ సిరీస్‌లో భాగంగా భారత్-దక్షిణాఫ్రికా మధ్య వైజాగ్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం జరగబోయే మూడు వన్డేకు అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో పూర్తి చేయటం జరిగిందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ అన్నారు. శనివారం వైజాగ్ క్రికెట్ స్టేడియంలో జరగబోయే మ్యాచ్‌కి సంబంధించిన ఏర్పాట్లును ఏసీఏ సెక్రటరీ సానా సతీష్, ఏసీఏ వైస్ ప్రెసిడెంట్ బండారు నరసింహారావు, కోశాధికారి దండమూడి శ్రీనివాసరావు, ఏసీఏ కౌన్సిలర్ విష్ణు దంతు, ఏసీఏ స్టేడియం చైర్మన్ ప్రశాంత్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సి.వో.వో గిరీష్ డోంగ్రే, ఏసీఏ సి.ఎ.వో జై కిషన్‌లతో శుక్రవారం సాయంత్రం ఎంపీ కేశినేని శివనాథ్ పరిశీలించారు. స్టేడియం మొత్తం తిరిగి ఏర్పాట్లను స్వయంగా సమీక్షించారు. పోలీస్ అధికారులతో మాట్లాడి భద్రత పరంగా తీసుకుంటున్న జాగ్రత్తలు తెలుసుకోవటంతో పాటు తగు సూచనలు, సలహాలు అందించారు. స్టేడియం లోపల, వెలుపల ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ప్రేక్షకులకు అవసరమైన తాగునీరు, శౌచాలయాలు, వైద్య సౌకర్యాలతోపాటు అగ్నిమాపక భద్రత వంటి కనీస వసతులు సరిగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు, ప్రముఖుల రాకపోకలు, వారి భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. మ్యాచ్ నిర్వహణలో పాల్గొనే ఏసీఏ సిబ్బంది, ఇతర ఏజెన్సీలు , పోలీసు యంత్రాంగం మధ్య పూర్తి సమన్వయం ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. కట్టుదిట్టమైన పోలీసు భద్రత విశాఖపట్నంలో జరగనున్న క్రికెట్ మ్యాచ్‌ను విజయవంతంగా, ఒక పండగ వాతావరణంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ తెలిపారు. ఈ సమగ్ర ఏర్పాట్లు మ్యాచ్‌ను చూసేందుకు వచ్చే వేలాది మంది క్రీడాభిమానులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన అనుభవాన్ని అందిస్తాయని స్పష్టం చేశారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టరు ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన విశాఖ ఉత్తర నియోజక వర్గ శాసన సభ్యులు విష్ణుకుమార్ రాజుతో కలసి అక్కయ్య పాలెం ఎన్జీవో కోలనీలో, జివిఎంసి హై స్కూలులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడ పిల్లల చదువుపై మరింత దృష్టి పెట్టాలన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకుంటే బాల్య వివాహ సమస్య ఉత్పన్నం కాదన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు క్రమశిక్షణ నేర్పాలన్నారు. తల్లిదండ్రులు క్రమశిక్షణ కలిగి ఉంటే పిల్లలకు కూడా మంచి క్రమశిక్షణ అలవాటవుతుందన్నారు. క్రమశిక్షణ పాటించిన వారు అన్ని రంగాలలో విజయమంతమవుతారన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్ కుమార్, కార్పొరేటర్ డి.శ్రావణి, మండల విద్యాశాఖాధికారి రామారావు, హెడ్ మాస్టర్ రాదా కుమారి, స్కూల్ కమిటీ చైర్మన్ అప్పలస్వామి, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఉమా మహేశ్వరరావు, లయన్స్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పెందుర్తి బిజెపి నాయకులు, స్థానిక 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న విద్యా, సహ విద్యా కార్యక్రమాలను కార్పొరేటర్ ముమ్మన పరిశీలించారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, అధ్యాపకులు కలిసి పనిచేయడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పాఠశాల నిర్వాహకులు కార్పొరేటరుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం,ఉపాధ్యాయులు, హెల్త్ సెక్రటరీ, అంగన్వాడి టీచర్, గ్రామ పెద్దలు రోమాల శ్రీను, పేరూరి చినబాబు, రోమాల నూకరాజు, జగ్గు నాయుడు, నాయుడు, కెవిఆర్.లక్ష్మి, చిట్టి భవాని, మణి, విద్యార్థులు తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పారిశ్రామిక ప్రాంత 40వ వార్డు పరిధి ఏకేసి కాలనీ, సింధియా, న్యూ కాలనీ, వివిధ స్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, వార్డు టిడిపి ఇన్చార్జి ఆర్ఆర్ రాజు, వార్డు జనసేన అధ్యక్షులు శివశంకర్ పాల్గొని

మాట్లాడుతూ ఈ మెగా పీటీఎం కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు స్కూలుకు వచ్చి తమ బిడ్డల చదువుల పురోగతిని టీచర్ల వద్ద నుంచి తెలుసుకొని పిల్లల భవిష్యత్తుని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక/అగనంపూడి: ప్రవహించే నదిలా జీవితం సాగాలని ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హితవు పలికారు. కష్టంతో కూడిన సుఖం అందమైన జీవితానికి నాంది ప్రస్తావన జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణాయుత నడవడికను అలవరచుకోవాలని సూచించారు. శుక్రవారం అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో హ్యాపీనెస్ ఉండడం తప్పేమీ కాదని అయితే క్యారెక్టర్ వదలొద్దని విద్యార్థులకు హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి అధ్యక్షత వహించిన ఈ సభలో జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, ఎన్డీఏ కూటమి నాయకులు మేడిశెట్టి విజయ్, కర్రీ దసేంద్ర, కరణం జగదీష్, కళాశాల అధ్యాపకులు ఎం.శ్రీదేవి, డి.దివ్య, జె.ప్రదీప్, జె.సూర్య పాల్గొన్నారు.

కొమ్మాది: కూటమి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని శనివారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ 5వ వార్డు పరిధి రాజీవ్ గృహకల్ప, బోట్టవానిపాలెం, నగరం పాలెం, బోరవానిపాలెం తదితర మండల ప్రాథమిక పాఠశాలలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా, సందడి వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు మొల్లి హేమలత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తకాల జ్ఞానంతో పాటు దేశభక్తిని, సమాజం పట్ల గౌరవాన్ని, క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలని, ఈ విలువలు వారిని మెరుగైన పౌరులుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల కళాత్మక ప్రదర్శనలు, ఆకర్షణీయమైన ప్రాజెక్ట్ ప్రదర్శనలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థుల వెలుగొందే భవిష్యత్తుకు ఇటువంటి సమావేశాలు మరింత ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు నాగోది సత్యనారాయణ, నగరాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి అనిత, బోయి రమాదేవి, మాచర్ల నాగేశ్వరరావు, ఆదినారాయణ, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సచిపాలయ్య కార్యదర్శిలు, స్థానిక నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో యువకుడు ఆత్మహత్య



విశాలాంధ్ర - మల్కాపురం: శ్రీహరిపురం ప్రాంతంలో యువకుడు ఆత్మహత్య కలకలం రేపింది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అచ్యుతాపురంలో ఒక కాంట్రాక్టర్ దగ్గర పనిచేస్తున్న మతిస్థిమితం సరిగా లేదని పనిలో నుండి తీసివేయగా అతనిని సొంత గ్రామమైన ఒరిస్సా రాష్ట్రానికి తరలించే సమయంలో సదరు వ్యక్తి శుక్రవారం సుమారు 11 గంటల సమయంలో కోరమండల గేటు వద్ద బస్సు నుండి కిందికి బలవంతంగా దిగి పారిపోవడం జరిగింది. వెంటనే అతనితోపాటు వచ్చిన వ్యక్తి అతనిని వెతుకుతుండగా దగ్గరలో ఉన్న ఒక ఇంటి మేడపైకి ఎక్కి అక్కడ ఉన్న వైర్లు మెడకు చుట్టుకుని మీద నుండి కిందకి దూకివేయగా ఆ వైర్లు మెడకు బిగిసుకుని సదరు మతిస్థిమితం లేని వ్యక్తి చనిపోవడం జరిగింది. మల్కాపురం పోలీసులు కేసును దర్యాప్తు చేయడం జరుగుతుంది. సదరు విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

మంత్రికి ఏఐటీయూసీ నేతలు వినతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మేఘాలయ హోటల్‌లో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ బాబ్జి కి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధానకార్యదర్శి పడాల రమణ, జిల్లా నాయకులు కోటా సత్తిబాబు, కృష్ణారావు, ఎన్ సూరి, ఎన్. సూర్య నారాయణ, వినోద్, నూకరాజు, కోనా లక్ష్మణ్ బక్కపాటి శ్రీనివాస్

తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రికి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ బోర్డులో పెండింగ్ లో ఉన్న 46వేల క్లైములను వెంటనే పరిష్కరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన సన్ స్కూల్ విద్యార్థి

విశాలాంధ్ర - భీమిలి: అక్టోబర్ 4వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏయూ గ్రౌండ్స్‌లో విశాఖ ఉమ్మడి జిల్లాస్థాయి 17 సంవత్సరాలలోపు బాల బాలికలకు నిర్వహించిన ఫుట్ బాల్ పోటీలలో 10వ తరగతి విద్యార్థి చేట్ల కార్తీక్ సన్ స్కూల్ నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అయ్యాడు. ఈ విద్యార్థి తేది.07.12.2025 నుండి తేది.09.12.2025 వరకు పలనాడు, గుంటూరు జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలియజేస్తూ, విద్యార్థికి సన్ స్కూల్ డైరెక్టర్ కైతవల్లి శ్రీనివాసరావు అభినందనలు తెలియజేశారు.

నేషనల్ టి-10 ఛాంపియన్ ట్రోఫీ 3వ స్థానంలో ఆంధ్రా జట్టు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: టి-10 టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రెండవ జూనియర్ నేషనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ మూడోవ స్థానంలో నిలిచింది. హిమాచల్ ప్రదేశ్ హమీర్ పూర్‌లో జరిగిన ఈ టి-10 టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్ షిప్‌లో 16 రాష్ట్రాల నుండి 16 టీం లు పాల్గొన్నాయి. బెస్ట్ ఆఫ్ త్రిగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ఏపీ మూడవ స్థానం

సాధించింది. ఆంధ్రప్రదేశ్ జట్టులో అత్యధికంగా ఉన్న క్రీడాకారుల్లో బాబా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉండడం గర్వకారణమని బిట్స్ వైజాగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ డా. ఎం.రంజాన్ బాబు అన్నారు. ఈ సందర్భంగా కరెస్పాండంట్ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సాహం ఇస్తూ వారిని అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే విధంగా కృషిచేస్తామని తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ జట్టుని మూడోవ స్థానంలో నిలిపిన కెప్టెన్, వైస్ కెప్టెన్ టి.హవిష్ నాయుడు, ఎం.పవన్, కోచ్ కె.విజయకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జట్టులో పాల్గొన్న క్రీడాకారులు ఎస్వీర్, రోహిత్, బాలు, సంతోష్, ఆకాష్, సాయి, వినోద్, హేమంత్, యోగి, శ్రీను, మధు, మౌళి, రాజు కుమార్, విష్ణును అభినందించారు.

భీమిలి సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొన్ని పెండింగ్ పనులు గురించి చర్చించారు. ఔట్ పేషెంట్స్ ఇన్ పేషెంట్స్ వార్డులలోని టాయిలెట్లు మరమ్మతులు చేయుటకు జనరేటర్ పాడవకుండా ఉండడానికి షెడ్ నిర్మించాలని తదితరాలకు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ శంకర్ ప్రసాద్, ఎంపీడీఓ కెవిఎస్ నరసింహారావు, మెంబర్లు సంకురుభుక్త జోగారావు, గొలగాని వెంకటరావు, ఎర్నింటి వరలక్ష్మి పాల్గొన్నారు.

దేశవ్యాప్త 'ఇసుజు ఐ కేర్ వింటర్ క్యాంప్' ప్రకటన

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఉత్తమ సర్వీస్, యాజమాన్య అనుభవాన్ని అందించాలని ఇసుజు నిబద్ధతను పునరుదొటించాలనే నిరంతర ప్రయత్నములో, ఇసుజు మోటార్స్ ఇండియా తన ఇసుజు డీ మ్యాక్స్ పిక్ అప్స్ మరియు ఎస్?యూవిల కొరకు దేశ-వ్యాప్త 'ఇసుజు ఐ కేర్ వింటర్ క్యాంప్' ను నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా ఈ సీజన్ లో సమస్యా రహితమైన డ్రైవింగ్ అనుభవము కొరకు వినియోగదారులకు ప్రస్తుత ప్రయోజనాలు మరియు నివారణాత్మక నిర్వహణ పరీక్షలు అందించడం ఈ సర్వీస్ క్యాంప్ లక్ష్యమని సంస్థ ప్రతినిధి చెప్పారు.

ఏఐని మరింత చేరువ చేస్తున్న అమెజాన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: లభ్యత, ఉత్పాదకత మరియు డిజిటల్ సమ్మిళితను పెంచడానికి భారత ప్రభుత్వ ఏఐ మిషన్‌కు మద్దతు ఇస్తూ, 2030 నాటికి లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ని అందించే ప్రణాళికలను అమెజాన్ ఈరోజు వెల్లడించింది. స్థానిక క్లౌడ్, ఏఐ మౌలిక సదుపాయాలలో యూఎస్ డాలర్ 12.7 బిలియన్ పెట్టుబడి పెట్టడానికి కంపెనీ ప్రణాళిక చేసింది. అంతేకాకుండా దాని విభిన్న వ్యాపారాల ద్వారా 15 మిలియన్లకు పైగా చిన్న వ్యాపారాలకు ఏఐ యొక్క ప్రయోజనాలను తీసుకువస్తుంది. 2030 నాటికి 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ అక్షరాస్యత, కెరీర్ అవగాహనను తీసుకురావడానికి అమెజాన్ కట్టుబడి ఉందని అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ అన్నారు.

2032 నాటికి వీఈఆర్ లక్ష్యం 120 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఎన్.యువరాజ్

విశాలాంధ్ర - విశాఖ : విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) ని 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం లక్ష్యమని వీఈఆర్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఎన్. యువరాజ్ తెలిపారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం వీఈఆర్ లోని పలు కీలక అంశాలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2047 నాటికి 1.0 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది తద్వారా ఆంధ్రప్రదేశ్ 2.40 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా చేరుకోవాలనే లక్ష్యంగా కొన్ని ప్రధాన రంగాలపై దృష్టి పెట్టడం జరిగిందని తెలిపారు. వాటిలో ప్రధానంగా పోర్టుల ద్వారా వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, ఐటీ హబ్స్, ఇన్నోవేషన్ సెంటర్ల అభివృద్ధి, వ్యవసాయం, అనుబంధిత పరిశ్రమల అభివృద్ధి, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, ఆరోగ్య సదుపాయాల కల్పన, మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిచడం, రహదారులు, రైల్వే, పోర్టుల వంటి వాటిని అభివృద్ధి చేయడం ఉన్నాయని తెలిపారు. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలతో కలిపి మొత్తం 21,880 చదరపు కిలోమీటర్ల పరిధిలో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు ప్రతిపాదించారని తెలిపారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ నుండి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్. కిశోర్, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె. రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ప్రణాళిక అధికారిని శిల్ప, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ లో 20 వినతులు వచ్చాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లో సమావేశ మందిరంలో ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు, సిపి లు, డీసీపీలు, ఏసీపీ లతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న కార్యక్రమం లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవు తున్నందున, జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 20 వినతులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 01, 3వ జోన్ కు 08, 4వ జోన్ కు 02, 5వ జోన్ కు 03, 6వ జోన్ కు 04, 8వ జోన్ కు 02 వినతులు వచ్చాయని తెలిపారు. స్వీకరించిన వినతులను /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని కమిషనరు తెలిపారు.

సిడబ్ల్యుసి ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పెన్షనర్స్ సమావేశం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ సిడబ్ల్యుసి ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పెన్షనర్స్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కనితి అప్పలరాజు అధ్యక్షతన వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు సిఐటియు సీనియర్ నాయకులు ఎస్.రామారావు మాట్లాడుతూ పెన్షన్ డబ్బులు కట్టిన వాళ్లు కూడా ఇంకా పెండింగ్లో ఉన్నవి అని వెంటనే ఇవ్వవలసినదిగా కోరారు. నేటికీ 11 సంవత్సరాలు కావస్తున్న మినిమం పెన్షన్ వెయ్యి రూపాయల నుంచి 3000 రూపాయలు ఉందని, కానీ చాలీచాలని పెన్షన్తో జీవనం సాగిస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మినిమం పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వాలని దానికి అనుగుణంగా డిఏ ఇవ్వాలని, భార్యాభర్తలకు మెడికల్ సౌకర్యం కల్పించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ రేపు ఢిల్లీలో 9, 10 తారీకుల్లో మహా ధర్నా ఉన్నది కావున దానికి విశాఖ నుంచి పెన్షర్లు 50 మంది వరకు బయలుదేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకినాడ పెంటరావు, మంత్రి గోపి, ముత్తుర్తి శ్రీరామ్ మూర్తి, కాకినాడ సింహాసనం, మేడిశెట్టి వెంకట్రావు, సిచేసెట్టి అప్పారావు, నక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి అమెజాన్స్ ఎవ్రీడే ఎసెన్షియల్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: శీతాకాలపు సందర్భంగా అమెజాన్ ఎవ్రీడే ఎసెన్షియల్స్ ఆఫర్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. తప్పనిసరిగా కలిగి ఉండవలసిన వివిధ రకాల ఉత్పత్తుల శ్రేణి. వాటిలో ఆరోగ్యం మరియు వ్యక్తిగత సంరక్షణ, రుచికరమైన ఆహారపు గ్రోసరీలు, శిశు సంరక్షణ, మరియు పెట్ కేర్ ఉత్పత్తులు కూడా ఉన్నాయి. సరళం, స్మార్టర్, మరియు ఆనందదాయకం. కొత్త ప్రత్యేకమైన స్టోర్‌ఫ్రంట్లు బేబీ గిఫ్టింగ్ మరియు ప్రీమియం బేబీ కేర్, లను కస్టమర్లు ఎక్స్ప్లోర్ చేయగలుగుతారన్నారు. వాటితోపాటు, ఇమ్యూనిటీ ఎసెన్షియల్స్, రెస్పిరేటరీ కేర్, మరియు కిడ్స్ వింటర్ హెల్త్ నుండి చక్కగా కూర్చిన పిక్స్ కూడా ఎక్స్ప్లోర్ చేయగలుగుతారు. వేగవంతమైన మరియు విశ్వసనీయమైన డెలివరీతో, చలికాలపు అవసరాల కోసం షాపింగ్ చేయటం ఇప్పుడు మరింత సౌకర్యవంతమయ్యింది. అమెజాన్ పే నుండి కస్టమర్లు మరింత అదనపు సొమ్మును ఆదా చేసుకోవచ్చు. కాగా ప్రైమ్ సభ్యులు, మరింత అదనపు సౌకర్యం కోసం వేలాది ఉత్పత్తులను అదే-రోజు డెలివరీ అందుకోగల లబ్దిని పొందవచ్చు అని చెప్పారు.

ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లు పరిశీలన

విశాలాంధ్ర -పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయితీ లో గల ఎస్ డబ్ల్యూ పి సి షెడ్ల నిర్వహణ, క్లోరినేషన్ తదితర కార్యక్రమాలను విశాఖపట్నం జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి పి

నారాయణమూర్తి శుక్రవారం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన షెడ్ల నిర్వహణ గురించి క్లోరినేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. తడి చెత్త పొడి చెత్త చెత్త నుండి ఎరువులు తయారీ తదితరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి నగేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ నిర్వహించిన గంటా

విశాలాంధ్ర -భీమిలి: ప్రజా సమస్య పరిష్కారంలో అలసత్వం వద్దని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. భీమిలి జోనల్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులు స్వీకరించారు. షాదీఖానా, స్మశానం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రోడ్లు, డ్రైయిన్లు కావాలని ఎమ్మెల్యేకు నివేదించగా

సాధ్యమైనంత త్వరగా పనులు చేయించాలని సూచించారు. భీమిలి జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఎమ్మార్వో పి. రామారావు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్ర, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెగా పేరెంట్స్ సమావేశాలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస ఎఫ్ హెచ్ బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాలలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం మెగా పేరెంట్ సమావేశంలో భాగంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ

భవిష్యత్ తరాలకు విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని ప్రభుత్వం అందిస్తున్నటువంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలిపారు. అనంతరం స్థానిక నాయకులు విద్యార్థులు తల్లిదండ్రులతో సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను తీర్చిదిద్దవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ కోన పైడిరాజు, వేములవలస కో- ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు రౌతు నాగరాజు, బంటుపల్లి గ్రామపంచాయతీ టిడిపి ప్రెసిడెంట్ బంటుపల్లి గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ షమ్ము, బంటుపల్లి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు కేశవరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌గా కేజీబీవీ
పి.టి.ఎం.లో శాసన సభ్యులు గంటా

ఆనందపురం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని మోడల్ స్కూల్ గా తీర్చిదిద్దుతానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. స్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగిన పేరెంట్ - టీచర్స్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ భవిష్యత్ లో ఏం కావాలనేది స్కూల్ దశలో నిర్ణయించుకుని ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అహర్నిశలు శ్రమించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, గురువులు, స్కూల్, ఊరు, జిల్లా, రాష్ట్రం గర్వపడేలా ఉన్నత స్థానానికి చేరుకుని, మంచి పేరు తెచ్చుకోవాలని హితబోధ చేశారు. విద్యార్థినులకు అవసరమైన మౌలిక సౌకర్యాలను సొంత ఖర్చులతో సమకూరుస్తున్న ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్‌ను గంటా



అభినందించారు. అంతకు ముందు స్కూల్ ప్రాంగణంలో బుద్ధుడు, మదర్ థెరిస్సా విగ్రహాలను ఆవిష్కరించారు. స్కూల్ లో అభివృద్ధి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ నాగమణి, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, గాడు వెంకటప్పడు, కురుమిన లీలావతి, పాండ్రంగి అప్పలరాజు, గంట్రెడ్డి సోమినాయుడు, రౌతు వెంకటరావు, బలిరెడ్డి మల్లిఖార్జునరావు, మహంతి శివాజీ, అంగటి రాము, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: తల్లిదండ్రులు, అధ్యాపకులు విద్యార్థుల పట్ల ఆదరణ కలిగి, ప్రేమతో, వారిని సరి అయిన బాటలో నడిపించాలని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లితండ్రుల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ- విద్యార్థులను దయ, కరుణలతో మార్చాలని, దండించకూడదని

అన్నారు. తల్లితండ్రులు మరియు అధ్యాపకులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. సమావేశంలో కళాశాల ప్రగతిపై ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. విద్యార్థులు పాటించవలసిన 50 రోజుల ప్రణాళికపై సీనియర్ అధ్యాపకులు ఎ. ఆదిలక్ష్మి ప్రసంగించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ఎకడమిక్ కో-ఆర్డినేటర్ శ్రీ జగన్నాథం పాల్గొన్నారు.

పెందుర్తి: విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 8వ జోన్ పెందుర్తి పరిధిలో సమగ్ర శిక్ష జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు - తల్లిదండ్రుల బృహత్ సమావేశానికి పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థ పై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులను మంచి

పౌరులుగా తీర్చిదిద్దేందుకు కార్యచరణ చేపట్టిందని తెలిపారు. పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు, పూర్వపు విద్యార్థులు, పలువురు దాతలు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నెల్లి ముక్కు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి బాలలను దేశ భవిష్యత్తు నిర్ణేతలుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లితండ్రులు ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వం కూడా తీసుకుంటుంది అని అన్నారు. ఈ సమావేశంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి

లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, పెద్దాడ సోము నాయుడు, శ్రీమునిసిరి శ్రీనివాస రావు, దొమ్మేటి సోము నాయుడు, బస అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభం మండలంలో ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులతో పిల్లలు గురించి తల్లిదండ్రులకు వివరించడం జరిగినది. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన ఎంపీటీ 3.0 సమావేశం వినూత్న రీతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు ఏర్పాటు చేసిన వృత్తి విద్యా స్టాల్స్ స్పోర్ట్స్ స్టాల్స్ సైన్స్ ప్రాజెక్టు మార్షల్ ఆర్ట్స్ మొదలైనవి ప్రదర్శించడం జరిగింది. వాటిని అక్కడికి వచ్చిన అతిథులు, తల్లిదండ్రులు వీక్షించి మెచ్చుకున్నారు. ఇందులో భాగంగా తహసిల్దార్ కె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ టీచర్స్‌ని వారి పనితీరుని ప్రశంసించారు. ఈ సందర్భంగా అమెజాన్

ఫ్యూచర్స్ స్కిల్స్ లో భాగంగా బెంగళూరుకి వెళ్ళబోతున్న ఓ వనజ ని అతిథులు అందరూ సత్కరించడం జరిగింది.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కే గ్రేస్ లిల్లీ, భీమిలి ఏఎంసీ చైర్మన్ కే రామస్వామి నాయుడు, ఎంపీపీ రాంబాబు, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు కే నగేష్ కుమార్, మెడికల్ డిపార్ట్మెంట్ సిబ్బంది ప్రజ్ఞ, ఎస్ ఎం సి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు, విద్యార్థులు తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: విశ్వ సౌభాగ్యానికి విద్యార్థులే పట్టుగొమ్మలని మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా డా.బి.ఆర్. అంబేద్కర్ జి.వి.యం.సి ఉన్నత పాఠశాల చిట్టివలస ప్రధానోపాధ్యాయులు వై.ఎస్.వి.వి. పి.డి జె స్వామి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కి విచ్చేసిన విద్యార్థి తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మీరు వెన్నెముకని చక్కని పాఠశాల బోధన సిబ్బందితో అభివృద్ధి పథంలో నడుస్తున్నామని క్రమశిక్షణ, ఐక్యత భావం తో పాఠశాలను ముందుకు నడిపించడంలో సహకరిస్తున్న పాఠశాల యాజమాన్య కమిటీకి

ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలదండలు వేశారు. ఈ సందర్భంగా స్టాల్స్ లో పుస్తక ఆవిష్కరణ,, వస్తు ప్రదర్శన, విజ్ఞాన ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, అసెస్మెంట్ మరియు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం కమిటీ చైర్మన్ వరలక్ష్మి, స్థానికులు పరిమి భువనేశ్వరి, తమ్మిన సూరిబాబు, దండి వెంకటేష్ ,జి.వి. రమణ, కొప్పల కృష్ణ , సుబ్బారావు, ఎస్ఎంసి వైస్ చైర్మన్ రూపవతి, ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, జగదీష్, సత్యలక్ష్మి, బలరామకృష్ణ, సూర్య మహేశ్వరరావు, శ్రీదేవి, ప్రమీల, సునీత, రాజ్యలక్ష్మి, మహాలక్ష్మి, రాంబాబు, పీఈటి ప్రతాప్, మేరీ గోల్డ్ , అంగన్వాడీ కార్యకర్తలు శ్రీగౌరీ , లక్ష్మి ,అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు .

పెరిగిన జీతాలు ఇవ్వాలని కోరుతూ
నీటి సరఫరా కార్మికులు సమ్మెబాట

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీలో నీటి సరఫరా విభాగంలో టెక్నికల్ విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు వారు చేస్తున్న పనుల ఆధారంగా తొమ్మిది మంది అధికారుల బృందం కమిటీ ఇచ్చిన నివేదికను జీవీఎంసీ అధికారులు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, అందుకు నిరసనగా ఈనెల 22 తేదీ సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపడతామని జీవీఎంసీ కాంట్రాక్టర్స్ వర్కర్స్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం. ఆనందరావు, ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యం శుక్రవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ (జనరల్) రమణమూర్తికి సమ్మె నోటీసులు అందజేశారు. అధికారుల కమిటీ నివేదిక, కౌన్సిల్ నిర్ధారించిన క్యాటగిరీలు వారీగా జీతాలు చెల్లించాలని కోరారు. క్యాటగిరి -1 క్రింద 148 మంది కి రూ. 24,500 జీతం ఇవ్వాలని, క్యాటగిరి -2 క్రింద 818 మందికి రూ. 21,500 జీతం ఇవ్వాలని, క్యారగిరి -3 క్రింద 261 మంది కి రూ. 18,500 రూపాయల జీతం ఇవ్వాలని, యు జి డి కార్మికులకు, కెనాల్ సిల్ట్ కార్మికులకు గత ఏడాది మార్చి 1 తేదీ నుంచి రావలసిన ఏరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని, నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు ఏరియర్స్ బకాయిలను చెల్లించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమస్యలపై కౌన్సిల్ తీర్మానాలు, ప్రభుత్వ ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదని అందుకు నిరసనగా ఈ సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

కేర్ హాస్పిటల్స్‌లో విజయవంతంగా వెయ్యి
రోబోటిక్ జీర్ణకోశ శస్త్రచికిత్సలు
ప్రముఖ రోబోటిక్ సర్జన్ డా. బి.బి.దాస్ నేతృత్వంలో నిర్వహణ

విశాలాంధ్ర- విశాఖపట్నం: విశాఖలోని కేర్ హాస్పిటల్స్ కి చెందిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్. బి. బి. దాస్ ఆధ్వర్యంలో కేవలం 18 నెలల్లో 1,000 రోబోటిక్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేసినట్టు కేర్ హాస్పిటల్స్, విశాఖపట్నం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జి.సుఖేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ "చాలా తక్కువ సమయంలోనే 1,000 రోబోటిక్ గ్యాస్ట్రో శస్త్రచికిత్సలు చేయడం మా వైద్యుల నైపుణ్యానికి, మా మీద ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి పెద్ద ఉదాహరణ అన్నారు. రోబోటిక్ టెక్నాలజీ వల్ల శస్త్రచికిత్సలు ఇంకా కచ్చితంగా, సురక్షితంగా జరుగుతున్నాయి. దీని వలన రోగులు త్వరగా కోలుకుంటున్నారు. తూర్పు భారతదేశంలోని ప్రజలకు అత్యాధునిక చికిత్సలు అందించడంలో ఇది ఒక కీలక ముందడుగు" అన్నారు. ఈ అరుదైన సాధనతో తూర్పు తీరంలో వైద్య రంగం ఎంత వేగంగా ముందుకు వెళ్తుందో స్పష్టంగా తెలుస్తోందన్నారు. గ్యాస్ట్రోఇంటెస్టినల్ క్లిష్టమైన శస్త్ర చికిత్సలు అయినప్పటికీ డా విన్సీ రోబోటిక్ సర్జికల్ సిస్టం వంటి అత్యాధునిక రోబోటిక్ సాంకేతికత వినియోగంతో శస్త్రచికిత్స చిన్న కోతలతో, తక్కువ రక్తస్రావంతో, చాలా కచ్చితంగా, సురక్షితంగా చేయడం సాధ్యమవుతోంది. దీనివల్ల రోగులు తక్కువ నొప్పితో, తక్కువ ఆసుపత్రి కాలంతో, వేగంగా ఇంటికి తిరిగి వెళ్తున్నారన్నారు. దశాబ్దాల అనుభవం కలిగిన డా. దాస్, చిన్న కోతలతో చేసే మినిమల్ ఇన్వాసివ్ శస్త్రచికిత్సలు మరియు రోబోటిక్ శస్త్రచికిత్సల్లో ముందంజలో ఉన్న నిపుణులు అని, ఆయన ఆంధ్రప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ మరియు సమీప ప్రాంతాల రోగులకు క్లిష్టమైన జీర్ణాశయ సంబంధిత సమస్యలకు అత్యంత కచ్చితమైన, భద్రమైన చికిత్స అందిస్తున్నారని చెప్పారు. కేర్ హాస్పిటల్స్‌లోని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, రోబోటిక్ సర్జరీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ బి. బి. దాస్ మాట్లాడుతూ, "18 నెలల్లో 1,000 రోబోటిక్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ శస్త్రచికిత్సలను పూర్తి చేయడం, ఆధునిక రోబోటిక్ టెక్నాలజీ ఆరోగ్య సేవలను ఎంత వేగంగా మార్చుతోందో చూపిస్తోందన్నారు. రోబోటిక్ సిస్టమ్‌లోని కెమెరా మరియు రోబోటిక్ చేతులు చాలా చిన్నస్థాయిలో, మన కళ్లకు కనపడని స్థాయి వరకు కచ్చితంగా పని చేస్తాయి. దీని వల్ల శస్త్రచికిత్స ఎంతో భద్రంగా జరుగుతుంది, రోగికి నొప్పి చాలా తగ్గుతుంది, ఆసుపత్రిలో ఉండే రోజులు కూడా గణనీయంగా తగ్గుతాయి. అంటే, ప్రపంచ స్థాయి కచ్చితమైన శస్త్రచికిత్స సేవలను ఇప్పుడు మన ప్రాంతం కూడా పొందుతోంది," అని అన్నారు. ఈ కార్యక్రమంలో రోబోటిక్ శస్త్రచికిత్స ఎలా రోగుల ఫలితాలను పూర్తిగా మార్చేస్తుందో స్పష్టంగా చూపించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను
ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు
- జిల్లా వైసీపీ అధ్యక్షులు కేకే రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కేకే రాజు అన్నారు. శుక్రవారం జిల్లా వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజల నుంచి అనూహ స్పందన లభించిందన్నారు. ప్రజల నుంచి సేకరించిన సంతకాలను ఈ నెల తొమ్మిదవ తేదీన అన్ని వార్డులు నుంచి వచ్చిన సంతకాలను నియోజకవర్గం కేంద్రాల్లో పంపాలి అని నియోజకవర్గాల నుంచి వచ్చిన సంతకాలను ఈ నెల 10 వ తేదీన జిల్లా కేంద్రాల్లో పంపాలన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించి ఈ నెల 13న జిల్లా కేంద్రాల నుంచి అన్ని నియోజకవర్గాల సంతకాలను ఒకేసారి రాష్ట్ర కేంద్ర కార్యాలయానికి చేరవేయడం జరుగుతుందని కమిటీ సభ్యులకు తెలియజేశారు. సమావేశంలో సమన్వయకర్తలు తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, మాజీ శాసన సభ్యులు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట రామయ్య, నియోజక పరిశీలకులు చింతకాయల సన్యాసి పాత్రుడు, కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు కోలా గురువులు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు గోలగాని హరి వేంకట కుమారి (మాజీ మేయర్) , బాణాల శ్రీనివాసరావు (ఫ్లోర్ లీడర్) తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన బాలల రక్షణాధికారి

విశాలాంధ్ర - భీమిలి: బాల్ వివాహ ముక్త్ భారత్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు భీమిలి కేజీబీవీ ని సందర్శించారు.. బాలల రక్షణాధికారి దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ..బాల్య వివాహాలను అరికట్టే దిశగా భారత ప్రభుత్వం 100 రోజుల అవగాహనా కార్యక్రమాలను ప్రారంభించిందని, ఈ కార్యక్రమాలు మర్చి 8, 2026 వరకు జరుగుతాయని తెలియచేసారు. మెగా పేరెంట్ టీచర్ మీట్ కి వచ్చిన

పేరెంట్స్ కి మరియు విద్యార్థినులకు బాల్య వివాహాలు, బాలల చట్టాలు కోసం అవగాహన కల్పించటం జరిగింది..అందరిచేత బాల్య వివాహాలు అరికడతాము అని ప్రతిజ్ఞ చేయించటం జరిగింది. ఈ కార్యక్రమంలో డి సి పి యూ సిబ్బంది ఎస్ లీలావతి, చైల్డ్ లైన్ ప్రతినిధి అంబేద్కర్, స్కూల్ ప్రిన్సిపాల్ కుమారి గంగ మరియు టీచర్స్ పాల్గొన్నారు

పల్స్ పోలియో కోసం శిక్షణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈనెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణ పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లోని పట్టణ,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైధ్యాదికారులందరికి ఈ నెల 21 నిర్వహించు పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి ప్రాంతీయ కంటి ఆసుపత్రి సమావేశ మందిరంలో ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆరోగ్య కేంద్ర వైధ్యాదికారులందరికీ పల్స్ పోలియో నేషనల్ ఇమ్మ్యునైజేషన్ డే 2025 మార్గదర్శకాలు , కార్యాచరణ గురించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డా.లూసీ, ఎస్.ఎం.ఓ, ఎన్.పి.ఎస్.పి., పట్టణ,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర -ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గడ్డి మందు తాగి ఒక వ్యక్తి మృతి వివరాల్లోకి వెళితే వేములవలస గ్రామానికి చెందిన పతివాడ . రామునాయుడు (69) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితం పై విరక్తితో లక్ష్మీవారం తమ పొలానికి ఉపయోగించే గడ్డి మందు తాగాడు విగతజీవిగా పడి ఉన్న తన భర్త రామనాయుడును గమనించిన మృతుడు భార్య తమ కొడుకు అప్పలరాజుకు తెలపగా చికిత్స కోసం ఎన్నారై హాస్పిటల్ కి చేర్చగా ఇంకా మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కెజిహెచ్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుడు కుమారుడు పతివాడ అప్పలరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై జి సంతోష్ కేసు నమోదు చేసుకొని ఈ కేసును ఏ ఎస్ ఐ ఎం.వి.రమణ దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీపీ నిధులతో సీసీ డ్రైనేజీ మంజూరు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని పద్మనాభం పంచాయతీ పరిధిలో ఎస్టీ కాలనీలో మండల పరిషత్ నిధులతో సుమారు 5 లక్షల వ్యయంతో సిసి డ్రైనేజీ నిర్మాణానికి స్థానిక ఎంపీపీ రాంబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం దిశగా ఈ డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. ఎంపీపీ నిధులతో 11 అంగన్వాడీ కేంద్రాలలో మరమత్తుల కొరకు సుమారు 13 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం సర్పంచ్ టీ పద్దు పాపా, ఎంపీటీసీ కె లక్ష్మీ ఎర్రి నాయుడు తదితరులు పాల్గొనడం జరిగినది.

మానాపురం రైల్వే సబ్ వే ఏర్పాటు చేయండి
డిఆర్ఎంను కోరిన మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విజయనగరం జిల్లా మానాపురం ఆర్ ఓ బి కి సమాంతరంగా రైల్వే సబ్ వే ఏర్పాటు చేసి స్థానికులు పశువుల రాకపోకలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విశాఖపట్నం రైల్వే డి ఆర్ ఎం లలిత్ బొహరాను కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డిఆర్ఎం కార్యాలయంలో లలిత్ బొహరాతో రాష్ట్ర మంత్రి కొండపల్లి సమావేశం అయ్యారు. మానాపురం ఆర్ ఓ బి కి సమాంతరంగా రైల్వే సబ్ వే ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. గజపతినగరం రైల్వే లైన్ వద్ద డ్రైన్ ఏర్పాటు, ఆర్ ఓ బి ఎలైన్మెంట్ గురించి మంత్రి చర్చించారు. రైల్వే బోర్డు తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డి ఆర్ ఎం లలిత్ బోహరా హామీ ఇచ్చారు.

1.85 కోట్లతో థీమ్ పార్క్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం, జివిఎంసి 97 వ వార్డు చిన్నముసిడివాడ, శ్రమశక్తి నగర్ కాలనీలో స్థానిక వార్డు కార్పొరేటర్ వసంత శంకర్రావు ఆధ్వర్యంలో 1 కోటి 85 లక్షలతో సుమారు ఎకరం భూమిలో నిర్మిస్తున్న థీమ్ పార్క్ నిర్మాణానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు శుక్రవారం మధ్యాహ్నం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల నాటికి ఎందుకు లేకుండా అన్ని పనులు పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ 8 జీవీఎంసీ జోనల్ కమిషనర్ శంకర్రావు, జీవీఎంసీ ఇంజనీర్ శ్రీనివాస రావు, డి ఈ పార్వతి, స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సేనాపతి శంకర్రావు, పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ అయితే సింహాచలం, సేనాపతి లీలాధ రావు, 96 వార్డు అధ్యక్షులు డిబిఎల్ సంతోష్, 94 వ వార్డు అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెంబర్ బండారు వరూధిని, సీనియర్ నాయకులు కరక దేవుడు, మడక బంగారు రాజు, అర్జున్ చౌదరి, తైనాలా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 26, 27 తేదీలలో
"జ్ఞాన్ 2కె25" టెక్నికల్ ఫెస్ట్

విశాలాంధ్ర తగరపువలస: అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్), తగరపువలస క్యాంపస్‌లో " జ్ఞాన్ 2కె25 " రెండు రోజులు నేషనల్ లెవెల్ టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమమును డిసెంబర్ 26 మరియు 27 వ తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, ఈ ఉత్సవానికి వివిధ కళాశాలలు నుండి విద్యార్థులు తయారు చేసిన క్రొత్త, క్రొత్త ప్రయోగాలపైన నైపుణ్యం, భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేయనున్నారు, అలాగే మారుతున్న పరిస్థితులనుగుణంగా వివిధ రంగాలలో ప్రభావం చూపుతున్న ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ పైన అలాగే ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు పైన దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు ఈ సాంకేతిక ఉత్సవములో ఉపదేశిస్తారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతులు మీదుగా అందచేస్తారని టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ ను విడుదల చేశారు, ప్రతి విద్యార్థి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ , డైరెక్టర్ డా. ఏ. చంద్రశేఖర్ , కన్వీనర్ డా. ఆర్. శశిధర్ , యు. రాము, , శామ్యూల్ సుశాన్ తెలియచేశారు.